## ఘనంగా ఫ్రెండ్‌షిప్ డే



కేపీహెచ్‌బీ కాలనీలో రమ్యాగ్రౌండ్‌లో ఆదివారం మిత్రమండలి ఆధ్వర్యంలో స్నేహితుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కాలనీ 3వ ఫేజ్‌లో మిత్రబృందంలోని సభ్యులంతా.. ఒకరినొకరు ఫ్రెండ్‌షిప్ బ్యాండ్‌లు కట్టుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం సహపంక్తి బోజనాలు చేశారు.

– కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 4

## ఎంపీ ఈటలను కలిసిన ఎమ్మార్పీఎస్ నాయకులు



కుత్బుల్లాపూర్, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై హర్షం వ్యక్తం చేస్తూ ఆదివారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను ఎమ్మార్పీఎస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి కేశపాగ రామచందర్, ఎన్‌వై అశోక్, బైరపోగు శివకుమార్, వడ్డేపల్లి శివ, రాసమల్ల యాదగిరి, సిలవేరు శ్రీనివాస్, పరశురాం, ఇస్రం రమేశ్, కురమయ్య, మహేశ్, సలోమి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ప్రజావాణి

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 4 : కూకట్‌పల్లి, మూసాపేట జంట సర్కిళ్ల కార్యాలయంలో సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఉపకమిషనర్లు రమేశ్, కృష్ణయ్య తెలిపారు. మూసాపేటలోని జీహెచ్‌ఎంసీ జంట సర్కిళ్ల కార్యాలయంలో ఉదయం 10.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ప్రజావాణి కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకరావాలన్నారు. ప్రజావాణిలో ఫిర్యాదులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు.

# పోలీస్‌స్టేషన్‌కు చేరిన 'ఇంజినీర్ల' పంచాయితీ!

- ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్న ఎస్ఈ, ఏఈ
- జోన్ ప్రతిష్ఠ దిగజార్చేలా చర్చనీయాంశంగా మారిన అధికారుల తీరు

మియాపూర్, ఆగస్టు 4 : ఐటీ పరిశ్రమలకు కేంద్రంగా ఉన్న శేరిలింగంపల్లి జోన్ ప్రతిష్ఠ కొందరు అధికారుల తీరుతో మసకబారుతున్నది. ఇప్పటికే కొన్ని విభాగాల్లో అవినీతి వ్యవహారం తారాస్థాయికి చేరడంతో వివాదం పతాక చేరుకున్నది. జోన్ పరిధిలోని ఇంజినీరింగ్ అధికారుల మధ్య నెలకొన్న వివాదం కాస్త ముదిరి పరస్పరం దాడులు చేసుకుని.. పోలీస్‌స్టేషన్ మెట్లు ఎక్కారు. ఒకరిపై మరొకరు వేర్వేరుగా ఫిర్యాదు చేసుకున్నారు.

జోన్ పరిధిలోని ఇంజినీరింగ్ విభాగంలో ఉన్నతాధికారి తనపై దాడి చేశాడంటూ సహాయ ఇంజినీర్ ఒకరు గచ్చిబౌలి ఠాణాలో రాతపూర్వకంగా ఫిర్యాదు చేయగా.. సదరు సహాయ ఇంజినీరే తనపై దాడికి పాల్పడ్డాడంటూ ఆ ఉన్నతాధికారి సైతం గచ్చిబౌలి ఠాణాలో ఫిర్యాదు చేశారు. తాను సమావేశానికి పిలవకపోయినా.. వచ్చి దురుసుగా మాట్లాడుతుంటే ఏఈని మందలించినట్లు ఉన్నతాధికారి పేర్కొంటున్నారు. అంతేకాకుండా దానిని దృష్టిలో పెట్టుకుని తన ఛాంబర్‌లోకి వచ్చి మరీ.. ఏఈల సమక్షంలోనే తనపై దాడి చేశాడంటున్నారు.

అయితే సమావేశానికి ఆలస్యంగా వచ్చావంటూ తనను తీవ్ర దుర్భాషలాడటంతో పాటు ఇదేమిటని అడిగేందుకు వెళ్లిన తనపై ఉన్నతాధికారి దాడి చేశాడంటూ సదరు సహాయ ఇంజినీరు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. గుత్తేదారుల నుంచి కమిషన్లు ఇప్పించటం లేదనే ఆగ్రహంతో తనపై దాడికి పాల్పడ్డాడంటూ సహాయ ఇంజినీరు ఆరోపిస్తున్నారు.

తప్పులు చేసేందుకు అలవాటు పడ్డ కొందరు కింది స్థాయి అధికారులు తమ మాట చెల్లడం లేదనే అక్కసుతో తనపై దాడికి పురికొల్పారని ఇంజినీరింగ్ ఉన్నతాధికారి పేర్కొంటున్నారు. కాగా ఈ ఇద్దరి పంచాయతీ కాస్తా ఠాణాతోపాటు జోనల్ సహా ఉన్నత స్థాయి అధికారుల దృష్టికి వెళ్లింది. అధికారుల తీరు జీహెచ్‌ఎంసీ ప్రతిష్ఠను మంటకలిపేలా ఉన్నదని ఉన్నతాధికారులు చర్చించుకుంటున్నట్లు తెలుస్తున్నది. ఈ సంఘటనపై అంతర్గత విచారణ జరిపి కఠిన చర్యలు తీసుకునే యోచనలో ఉన్నట్లు సమాచారం.

## పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్ష తేదీలు ఖరారు

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ పరీక్ష తేదీలను ఖరారు చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు తెలిపారు. కోర్సు రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్ పరీక్షలను ఈనెల 7 నుంచి నిర్వహించనున్నట్లు చెప్పారు.

## డిగ్రీ కోర్సుల ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని అన్ని డిగ్రీ కోర్సుల వన్‌టైం చాన్స్ పరీక్షా ఫలితాలను ఆదివారం విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బెదిరింపులు బాధాకరం

- కుక్కకాటు బాధితులను పరామర్శించకుండా.. సేవలందించిన సామాజిక కార్యకర్తలకు బెదిరింపులా!
- బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి

బాలానగర్, ఆగస్టు 4 : బాలానగర్ డివిజన్‌లో పిచ్చి కుక్క 24 మందిని కరిచినా కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ బాధితులను పరామర్శించకుండా సేవలందించిన వారిని బెదిరించడం బాధాకరమని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గురువారం సాయంత్రం బాలానగర్‌లోని వినాయక్‌నగర్, రాజుకాలనీ, సాయినగర్, నవజీవన్‌నగర్ ప్రాంతాల్లో పిచ్చి కుక్క స్వైర విహారం చేస్తూ పలువురు చిన్నారులను కరిచి తీవ్రగాయాలు చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. పిచ్చికుక్క కరుస్తుందని తెలుసుకొని తాను స్థానికులను అప్రమత్తం చేశానన్నారు. అంతేకాకుండా బాధితులను స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించి వ్యాక్సిన్లు వేయించి వారికి ధైర్యం చెప్పినట్లు పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేశ్ మాత్రం బాధితులను పరామర్శించకుండా సేవలందించిన సామాజిక కార్యకర్తలను బెదిరించడం ఎంతవరకు సబబని ఆయన ప్రశ్నించారు. కాంగ్రెస్ నేతల బెదిరింపులకు భయపడేది లేదన్నారు. కాంగ్రెస్ నాయకులకు ప్రజలపైన ప్రేమ ఉంటే బాధితులను పరామర్శించాలి.. కానీ రాజకీయాలు చేయడం తగదని హితవు పలికారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కుక్క కాటు బాధితులను పరామర్శించి వారికి అండగా నిలిచినట్లు కార్పొరేటర్ పేర్కొన్నారు.

# ఘనంగా బోనాలు.. ఆలయాల్లో పూజలు



పూజల్లో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

మియాపూర్, ఆగస్టు 4 : కూకట్‌పల్లి డివిజన్ దీనబంధు కాలనీలోని రేణుకా ఎల్లమ్మ ఆలయంలో ఆదివారం నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో కాంగ్రెస్ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్, నాయకుడు వెంకటేశ్వర్‌రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ వారి అనుగ్రహంతో నియోజకవర్గ ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని వారు ఆకాంక్షించారు.



మూసాపేట బండ మైసమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న తూము శ్రావణ్‌కుమార్

**బండ మైసమ్మ ఆలయంలో మాజీ కార్పొరేటర్ పూజలు**

మూసాపేట : ఆషాఢ బోనాల సందర్భంగా మూసాపేటలో ఒడ్డెర సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాలకు డివిజన్ మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్‌కుమార్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, మల్లేశ్, తుకారాం, విష్ణు, సత్తయ్య, రాజు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

**బండిమైసమ్మ ఆలయంలో..**

కేపీహెచ్‌బీ కాలనీ : బాలాజీనగర్ డివిజన్‌లోని జనతానగర్ బండి మైసమ్మ ఆలయంలో నిర్వహించిన ఆషాఢ బోనాల ఉత్సవాల్లో కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ కూకట్‌పల్లి ఇన్‌చార్జి బండి రమేశ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. సంస్కృతి సాంప్రదాయాలను కాపాడుకుంటూ... బోనాలను వైభవంగా జరుపుకోవడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నేతలు జి.వెంకటేశ్వర్‌రావు, శ్రీను, సాయిలు, నర్సింహ, సత్యనారాయణ, ఎల్లయ్య, తదితరులు ఉన్నారు.



జనతానగర్ బండి మైసమ్మ ఆలయంలో పూజల్లో పాల్గొన్న నాయకులు

## శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్



అల్లాపూర్, ఆగస్టు 4 : శ్రీవివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్ష ఎన్నికల్లో బొల్లు శ్రీనివాస్ గెలుపొందారు. ఆదివారం నిర్వహించిన ఎన్నికల్లో యాదవరెడ్డి, మస్తాన్‌రెడ్డి, బొల్లు శ్రీనివాస్ అధ్యక్ష స్థానానికి పోటీపడ్డారు. మొత్తం 1044 ఓట్లు ఉండగా మస్తాన్‌రెడ్డికి 265 ఓట్లు, యాదవరెడ్డికి 327 ఓట్లు, బొల్లు శ్రీనివాస్‌కు 452 ఓట్లుతో వచ్చాయి. మెజార్టీ ఓట్లు సాధించిన బొల్లు శ్రీనివాస్‌కు ఎన్నికల అధికారి సామకొండల్‌రెడ్డి అధ్యక్షుడిగా నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

## ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతులు



ప్రజలతో మాట్లాడుతున్న కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

కుత్బుల్లాపూర్, ఆగస్టు 4 : నియోజకవర్గానికి చెందిన పలువురు సంక్షేమ, స్వచ్ఛంద సంఘాల ప్రతినిధులు, ప్రజలు ఆదివారం ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. తమ సమస్యలను పరిష్కరించాలని వినతిపత్రాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రజాసమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

## ముగిసిన బెంగాలీ హస్తకళా మేళా



ఆకట్టుకున్న కళాకారుల ప్రదర్శన

కొండాపూర్, ఆగస్టు 4 : మాదాపూర్‌లోని శిల్పారామంలో రెండు రోజులుగా సాగుతున్న బెంగాలీ హస్తకళా మేళా ఆదివారం ముగిసింది. శిల్పారామం, బెంగాలీస్ ఇన్ హైదరాబాద్ సంయుక్త ఆధ్వర్యంలో 'ఎస్పీర్మితి–04' పేరిట నిర్వహిస్తున్న మేళాలో బెంగాలీ చేనేత హస్తకళా ఉత్పత్తులతో పాటు వారి సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా కళా ప్రదర్శనలు, వివిధ రకాల వంటకాలు సందర్శకులను ఆకర్షించాయి. మేళాలో సుమారు 300 మంది కళాకారులు పాల్గొని ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు.

## షాపూర్‌నగర్‌లో సీపీఎం విరాళాల సేకరణ



షాపూర్‌నగర్‌లో ప్రజల నుంచి విరాళాలు సేకరిస్తున్న సీపీఎం నాయకులు

దుండిగల్, ఆగస్టు 4 : కేరళ రాష్ట్రం వయనాడు వరద బాధితులను ఆదుకునేందుకు ప్రతిఒక్కరూ మందుకురావాలని సీపీఎం కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి కీలుకాని లక్ష్మణ్ అన్నారు. ఇటీవల కొండచరియలు విరిగిపడటంతోపాటు వరద విళయంలో తీవ్రంగా నష్టపోయిన అక్కడి ప్రజలను ఆదుకునేందుకు ఆదివారం సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో సూరారాం డివిజన్ పరిధిలోని షాపూర్‌నగర్‌లో విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మణ్ మాట్లాడుతూ.. సర్వం కోల్పోయి ఆపదలో ఉన్న వయనాడు బాధితులకు అందరం అండగా నిలుద్దామని పిలుపునిచ్చారు. సీపీఎం మండల కమిటీ సభ్యులు సత్యం, శంకర్, స్వాతి, సీఐటీయూ నాయకులు శీను, కరుణాకర్, మల్లారెడ్డి, కృష్ణ, ఏసు, పాష పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం : కౌన్సిలర్



నాయకులతో మాట్లాడుతున్న కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ

దుండిగల్, ఆగస్టు 4 : ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా నిరంతరం కృషి చేస్తున్నానని కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ నాయకుడు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణ అన్నారు. నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కౌన్సిలర్ శంభీపూర్ కృష్ణను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా తమ ప్రాంతాల్లో నెలకొన్న సమస్యలను వివరించారు. సానుకూలంగా స్పందించిన ఆయన ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ముందుకు వెళుతున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.

## ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



ఉచిత వైద్య శిబిరంలో ప్రజలకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

మాదాపూర్, ఆగస్టు 4: హఫీజ్‌పేట్‌లోని ఇంజినీర్స్ ఎన్‌క్లేవ్ కమ్యూనిటీ హాల్‌లో ఆదివారం ఒమెగా హస్పిటల్, గచ్చిబౌలి సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిర్వ హించిన ఈ శిబిరంలో ఎత్తు, బరువు, షుగర్, బీపీ, 2డి ఇకో, ఈసీజీతో పాటు మహిళలకు పాప్‌స్మెర్, మామోగ్రఫీ, క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ మాట్లాడుతూ.. అనారోగ్య సమస్యలు వచ్చినప్పుడు అశ్రద్ధ చేయకుండా తక్షణమే వైద్యులను సంప్రదించాలని కోరారు. 35 ఏండ్లు దాటిన మహిళా ప్రతి రెండేండ్లకు ఒకసారి క్యాన్సర్ పరీక్షలు చేయించుకోవాలన్నారు. జనరల్ ఫిజీషియన్ డాక్టర్ అర్చన, అంకాలజిస్ట్ డాక్టర్ ప్రమత సాయిరెడ్డి వైద్య సేవలందించారు.

## ఉచిత వైద్యశిబిరం అభినందనీయం



కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 4 : బాలాజీనగర్ కాలనీలో మాక్స్‌విజన్ దవాఖాన ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించడం అభినందనీయమని కూకట్‌పల్లి సీఐ ముత్తు అన్నారు. ఆదివారం పోలీస్ స్టేషన్‌లో వైద్యశాల డాక్టర్లు, సిబ్బందిని సీఐ ముత్తు అభినందించారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు ఐస్‌క్రీమ్ వెంకట్‌రెడ్డి, గువ్వల శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు ఉన్నారు.

## రాఘవేంద్ర కాలనీలో సమస్యలను పరిష్కరించండి



కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 4: రాఘవేంద్ర కాలనీలో ప్రజా సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం కూకట్‌పల్లి మండల నాయకుడు కృష్ణనాయక్ అధికారులను కోరారు. ఆదివారం బాలాజీనగర్ డివిజన్ రాఘవేంద్రకాలనీలో ఆయన పర్యటించి ప్రజలను సమస్యలడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతూ.. రాఘవేంద్ర కాలనీలో దోమల సమస్యతో పేదలు నిత్యం జాగారం చేయాల్సివస్తున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. పక్కనే ఉన్న కామునిచెరువులో గుర్రపుడెక్కను తొలగించాలని కోరారు. కాలనీ పక్కన పైప్‌లైన్ తవ్విన గుంతలను పూడ్చాలని, డ్రైనేజీ, విద్యుత్ సమస్యలను పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ మండల నాయకులు నరసింహ, నాగమణి, పెంచలమ్మ, కృష్ణవేణి, గంగాదేవి తదితరులు ఉన్నారు.

## నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

బాలానగర్, ఆగస్టు 4 : 33/11 కేవీ విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా సోమవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని బోయిన్‌పల్లి సెంట్రల్ బ్రేక్‌డౌన్ (సీబీడీ) ఏడీఈ శ్రీనివాస్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ పరిధిలోని శివాలయం ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి 11.30 గంటల వరకు ఐడీపీఎల్ సబ్‌స్టేషన్ బాలానగర్, శివాలయం, రైల్వేకాలనీ గేట్, హనుమాన్ టెంపుల్, సమతానగర్, కేతాన్ స్టీల్ ట్రేడర్స్ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 12 నుంచి 1.30 గంటల వరకు ఓబులమ్ పీడర్ పరిధిలోని ఓబులమ్, బాలానగర్, ఈఎంఆర్ టెక్నాలజీ, రోబోటిక్స్ స్టీల్, సునీల్ ఇంజినీరింగ్, ఓబులమ్ కంపెనీ ప్రాంతాల్లో, మధ్యాహ్నం 3 నుంచి 4.30 గంటల వరకు ప్రశాంత్‌నగర్ సబ్ స్టేషన్ పరిధిలోని రాజీవ్‌గాంధీనగర్ ఫీడర్‌లోని ఐడీ ప్రెష్‌ఫుడ్స్, ఎస్ఆర్ ఎంటర్ ప్రైజెస్, డెక్కన్స్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించగలరని ఆయన సూచించారు.

## బాలానగర్‌లో మహిళ అదృశ్యం



సుందర్ శాంతి(ఫైల్)

బాలానగర్, ఆగస్టు 4 : కోడలుతో గొడవ పడిన అత్త ఇంటినుంచి బయటకు వెళ్లి అదృశ్యమైంది. ఈ ఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ నవీన్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలానగర్ శోభనకాలనీ రోడ్ నంబర్ 2లో నివాసముంటున్న సుందర్ శాంతి (57) సాయిబాబానగర్‌లో మనవరాలు ఐశ్వర్యను కలిసి వచ్చింది. ఈ విషయంలో అత్తతో కోడలు గొడవ పడింది. దీంతో మనస్తాపానికి గురైన శాంతి ఇంట్లో ఎవరికీ చెప్పకుండా ఆధార్‌కార్డు తీసుకొని బయటకు వెళ్లి తిరిగి రాలేదు.

దాంతో కుమారుడు శివకుమార్ తల్లి శాంతి ఆచూకీ కోసం పరిసర ప్రాంతాలు, బంధువుల వద్ద గాలించినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. వెంటనే శివకుమార్ బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నారు.

# సీఎంఆర్‌ఎఫ్‌తో పేదల ఆరోగ్యానికి భరోసా

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



బాధిత కుటుంబసభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్, ఆగస్టు 4: పేదల ఆరోగ్యానికి సీఎం సహాయ నిధి భరోసాగా నిలుస్తున్నదని ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆపన్నహస్తం అందిస్తునదని అన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలో నలుగురికి సీఎం సహాయ నిధి పథకం కింద మంజూరైన రూ. 1.25 లక్షల విలువైన చెక్కులను కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఎమ్మెల్యే గాంధీ ఆదివారం తన నివాసంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. సీఎం సహాయ నిధితో నిరుపేదలు కార్పొరేట్ దవాఖానల్లో ఉచితంగా వైద్య సేవలు పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రకాంత్, కాశీనాథ్, సత్యనారాయణ, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, మంజుల, రాధాబాయి పాల్గొన్నారు.

**బోనాల వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే**

కూకట్‌పల్లి డివిజన్ పరిధిలోని దీన బంధు కాలనీలో శ్రీ మైసమ్మ, పోచమ్మ దేవాలయాలలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ పాల్గొన్నారు. అమ్మవారలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇబ్రహీం, ఎల్లం నాయుడు, మోహన్‌రావు, మహేందర్, వెంకటేశ్, సుధాకర్, ఆంజనేయులు, డేవిడ్, రామారావు, అశోక్, మహేశ్, సుహాస్, బాలు, నాగన్న రాజు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

**అయ్యప్ప సొసైటీలో..**

మాదాపూర్ : అయ్యప్పసొసైటీలో షణ్ముక్ యాదవ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బోనాల ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరిగాయి. పలారం బండి ఊరేగింపులో 10 వేల మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ విచ్చేసి మాట్లాడారు. బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని అన్నారు. అమ్మవారి దీవెనలతో ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు నాయకులు ప్రజలు పాల్గొన్నారు.




మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో బోనాల వేడుకల్లో పాల్గొన్న భక్తులు

## వాసవీసేవాదళ్ ఆధ్వర్యంలో మహాన్నదానం



కుత్బుల్లాపూర్, ఆగస్టు 4 : వాసవీసేవాదళ్ ఆధ్వర్యంలో ప్రతి అమావాస్య రోజున పేదలకు ఉచితంగా మహాన్నదానం చేపడుతున్నారు. ఆదివారం జీడిమెట్ల విలేజ్ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన మహాన్నదాన కార్యక్రమాన్ని కొంపల్లి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, కౌన్సిలర్ చింతల రవీందర్‌యాదవ్ ప్రారంభించారు. కార్యక్రమంలో వాసవీసేవాదళ్ ప్రతినిధులు, స్థానికులు పాల్గొన్నారు.

## కారును ఢీకొన్న లారీ.. ముగ్గురికి గాయాలు



కారును వెనుక నుంచి ఢీకొట్టిన లారీ

కుత్బుల్లాపూర్, ఆగస్టు 4 : లారీ డ్రైవర్ నిర్లక్ష్యంగా వెనుకకు అతివేగంగా లారీని తీసుకెళ్లడంతో వెనుక ఉన్న కారును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ఉన్న ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. సుభాష్‌నగర్ నుంచి సాయిబాబానగర్‌కు వెళ్లే మార్గంలో ఆర్టీసీ బస్ డిపో వెనుక వైపు ఉదయం 5.30 గంటల ప్రాంతంలో లారీని డ్రైవర్ వెనకాల ఉన్న స్విఫ్ట్‌కారును చూసుకకోపోవడంతో అతివేగంతో ఢీకొట్టాడు. దీంతో కారులో ఉన్న నవీన్, భానుప్రసాద్, మోహన్‌కు తీవ్రగాయాలు కాగా స్థానికంగా ఉన్న ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ ఘటనపై ఇప్పటివరకు ఎవరూ ఫిర్యాదు చేయలేదని పోలీసులు పేర్కొన్నారు.

## ఐటీ ఉద్యోగి ఆత్మహత్య



చాణక్యవర్మ (ఫైల్)

మాదాపూర్, ఆగస్టు 4: ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఐటీ ఉద్యోగి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఆదివారం మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. విజయనగరానికి చెందిన నంబూరి రాజవర్మ బతుకుదెరువు కోసం కుటుంబసభ్యులతో వచ్చి మాదాపూర్‌లోని చందానాయక్‌తండాలో నివాసం ఉంటున్నాడు. కాగా రాజవర్మ కుమారుడు చాణక్య వర్మ(25) ఐటీ ఉద్యోగి. ఈనెల 3న స్నేహితుడి మొబైల్ తీసుకొని ర్యాపిడో బుక్ చేశాడు. రాత్రి 2:30 గంటల సమయంలో కేబుల్ బ్రిడ్జి వద్దకు వచ్చి దుర్గం చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న లేక్ పోలీసులు శవాన్ని ఆదివారం ఉదయం వెలికితీసి మృతదేహన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు. కాగా ఆర్థిక ఇబ్బందులు తాళలేకనే చాణక్యవర్మ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

## అన్నదానం



దుండిగల్, ఆగస్టు 4 : అన్ని దానాలలోకెల్లా అన్న దానం గొప్పదని సూరారం డివిజన్(129) కార్పొరేటర్ మంత్రి సత్యనారాయణ అన్నారు. సూరారం డివిజన్ పరిధి షాపూర్‌నగర్ మార్కెట్‌లో ఆదివారం నల్లపోచమ్మ గుడి ఆలయ కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానంలో ఆయన పాల్గొని మాట్లాడారు. భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

**జగద్గిరిగుట్ట పరిధిలో...**



జగద్గిరిగుట్ట : సోమయ్యనగర్, భూదేవిహిల్స్‌లోని అమ్మవారి ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు జరిగాయి. అన్నదానం చేశారు. ప్రజలంతా సంతోషంగా ఉండాలని కార్పొరేటర్ జగన్ ఆకాంక్షిం చారు. నిర్వాహకులు, భక్తులు ధపాల్గొన్నారు.

## కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, ఆగస్టు 4 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో ఆదివారం కూరగాయల ధరలు (కేజీ–రూపాయలు) కింది విధంగా ఉన్నాయి. టమాట 27, వంకాయ 40, బెండకాయ 35, పచ్చిమిర్చి 55, బజ్జి మిర్చి 55, కాకరకాయ 45, బీరకాయ 35, క్యాబేజి 23, ఫ్రెంచ్ బీన్స్ 60, క్యారెట్ 37, కాలీఫ్లవర్ 23, దొండ 40, చిక్కుడు 70,గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 28, క్యాప్సికం 47, ఆలుగడ్డ 38, కీర 28, దోసకాయ 17, సొరకాయ 15, పొట్లకాయ (1) 18, కందగడ్డ 50, ఉల్లిపొరక 35 , ఉల్లిగడ్డ 39, చింతకాయ–, మామిడికాయ(1) 15 నుంచి 20, అరటికాయ(1) 8 నుంచి 10, చామగడ్డ 40, ముల్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 55, గుమ్మడికాయ 30, నిమ్మకాయలు (12) 50 నుంచి 60, మునగకాయ (1) 8 నుంచి 10, పచ్చి బఠాని–, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 200, వెల్లుల్లి 280, చింతపండు 140, కరివేపాకు 80గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9.30 గంటల వరకు రైతుబజార్‌లో అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.